

నూతన వధూవరులకు ఆశీర్వచనం

ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు కుమారుడు వివాహ రిసెప్షన్‌లో నూతన దంపతులకు అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని, ఒంగోలు ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత తదితరులు. - ఒంగోలు సబర్బన్

వేసవిలో ఆరోగ్యం జాగ్రత్త



సమ్మర్ కిట్‌లను పంపిణీ చేస్తున్న ఎస్పీ మలికా గర్గ్

● ట్రాఫిక్ పోలీసులకు ఎస్పీ మలికా గర్గ్ సూచన

ఒంగోలు టౌన్: వేసవిలో విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బంది తగిన జాగ్రతలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్పీ మలిక గర్గ్ సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాయలయంలో వేసవి తాపం నుంచి రక్షణ పొందేందుకు ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్లను పంపిణీ చేశారు. వేసవి నుంచి రక్షణ కల్పించే హెల్మెట్, సమ్మర్ హ్యాట్స్, కూలింగ్ గ్లాసులు, కూలింగ్ వాటర్ బాటిళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, రాత్రి వేళల్లో ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బందికి ప్రమాదాలు జరగకుండా లైటింగ్ బ్యాట్‌లు, రేడియం రిఫ్లెక్టింగ్ సేఫ్టీ జాకెట్లను ఈ కిట్ల ద్వారా అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ మండుటెండల్లో విధులు నిర్వహించడం చాలా కష్టంగా కూడుకున్నదని, తీవ్రమైన ఎండలో దుమ్ము, ధూళి లెక్క చేయకుండా విధులు నిర్వహించే వారు, స్వీయ ఆరోగ్య జాగ్రతలు తీసుకోవాలని చెప్పారు. ఎండకు వడ దెబ్బలాంటివి తగలకుండా, డీ హైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు ఎక్కువగా నీళ్లు తాగాలని, పల్చటి మజ్జిగ, నిమ్మ రసం, ఓఆర్ఎస్ లాంటివి తాగాలన్నారు. వేసవిలో తగిన జాగ్రతలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందకు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్)కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాసరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, తాలుకా సీఐ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ శ్రీహరి రెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ఎస్పీ మలిక గర్గ్‌కు పోలీసు అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

గోల్డ్ మెడల్ సాధించిన సాయిరాం

ఒంగోలు టౌన్: ఒంగోలుకు చెందిన పన్నెండేళ్ల బాలుడు అంతర్జాతీయ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి ఔరా అనిపించాడు. గుంటూరులో ఈనెల 19వరకు జరిగిన పోటీల్లో అపెక్స్ స్కూలులో 7వ తరగతి చదువుతున్న వై.సాయిరామ్‌రెడ్డి గోల్డ్ మెడల్ సాధించాడు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలిక గర్గ్ అభినందించారు.

బ్లాక్ స్పాట్ల పరిశీలన

మద్దిపాడు: మండల పరిధిలోని ఏడు గుండ్లపాడు నుంచి గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వరకూ ఉన్న బ్లాక్ స్పాట్‌లను జాతీయరహదారి పక్కన అనధికారికంగా నిలుపుతున్న లారీలు ఉండే ప్రాంతాలను జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. జాతీయరహదారి వెంట అనధికారికంగా లారీలను నిలుపుదల చేస్తున్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో లారీలు నిలపకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో జాతీయరహదారికి రెండు వైపులా లారీలు రోడ్డుపైనే నిలుపుతున్న వైనాన్ని గమనించారు. కమిటీ సభ్యులు గమనించిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు ఎస్ఐ శ్రీరామ్ తెలిపారు. ఎంపీఐ రామచంద్రయ్య పంచాయతీరాజ్ ఏఈ సునీల్, డిప్యూటీ తహసీల్దార్ మీన, సర్వేయర్ సునీల్ హైవే పెట్రోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



సంయమనం పాటించాలి

ఒంగోలు టౌన్: ప్రతిపక్షం తొందరపడినా అధికారపక్షం సంయమనం పాటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం ఒంగోలు లోని సుందరయ్య భవనం మాట్లాడారు. అసెంబ్లీలో సోమవారం నాడు జరిగిన ఘటన వలన చట్ట సభల ప్రతిష్ట దిగజారిందని చెప్పారు. సయ్యద్ హనీఫ్, పూనాటి ఆంజనేయులు పాల్గొన్నారు.





రాగిజావతో సంపూర్ణ ఆరోగ్యం

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న గోరుముద్ద ద్వారా అదనంగా అందిస్తున్న రాగి జావ విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తుందని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. మంగళవారం చీమకుర్తిలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద ద్వారా ఇప్పటికే వారానికి 5 కోడిగుడ్లు, మూడు రోజులు చిక్కీలు, రోజుకో మెనూతో బలమైన పోషకాహారాన్ని ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. వాటికి తోడు ఇప్పుడు అందిస్తున్న రాగి జావ మంగళవారం, గురువారం, శనివారం అందిస్తారన్నారు. రాగిజావలో కాల్షియం, ఐరన్‌తో పాటు ఇతర పోషకాలు అందుతాయన్నారు. దాని వలన విద్యార్థులలో మంచి ఆరోగ్యం ఏర్పడుతుందని, చదువుపై ఏకాగ్రత పెరగటానికి తోడ్పడులుందన్నారు. క్రమం తప్పకుండా విద్యార్థులకు వారానికి మూడు రోజులు రాగిజావను అందించాలని టీచర్‌లకు సూచించారు. అనంతరం హైస్కూలులో జరుగుతున్న నాడు-నేడు అదనపు తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించారు. తొలుత జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు బాలికలు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. టీచర్‌లు శాలువాతో ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, ఎంఈఓ టి.రవి, కౌన్సిలర్ బీమన వెంకట్రావు, టీచర్‌లు నల్లూరి వెంకటేశ్వరరావు చల్లా శ్రీనివాసరావు, పి.గోవిందమ్మ, కట్టా నాగమణి, వీఎస్ కామేశ్వరి, డి.వరలక్ష్మి, ఎల్.జ్యోతి, ఎల్.నారాయణమ్మ, ఎస్.ఎస్.ఎస్ పార్వతి, స్థానికులు పాల్గొన్నారు.



బూచేపల్లి వెంకాయమ్మను సత్కరిస్తున్న టీచర్లు



చీమకుర్తి జిల్లాపరిషత్ బాలికల హైస్కూలులో రాగి జావను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

గాంధీనగర్‌లో కౌన్సిలర్ ఆధ్వర్యంలో..

చీమకుర్తి గాంధీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్థానిక కౌన్సిలర్ సోమా శేషాద్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రధానోపాధ్యాయులు చాట్ల శ్రీనివాసరావుతో పాటు స్థానిక నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సచివాలయాల్లో ఆధార్ కార్డు సేవలు

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): సచివాలయాల్లో వివిధ రకాల ఆధార్ మార్పులు చేయనున్నట్లు ఎంపీడీవో పి.సుజాత తెలిపారు. రెండురోజుల నుంచి ఆయా సచివాలయ పరిధిలో ఆధార్ కార్డులో మార్పులు చేస్తామన్నారు. మంగళవారం కె.పల్లెపాలెం గ్రామ సచివాలయంలో సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు ఆధ్వర్యంలో ఆధార్ కార్డులో మార్పులు కార్యక్రమం నిర్వహించారు. డీఏ జి.శ్వాత, డిజిటల్ అసిస్టెంట్ ఇసాక్, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్యామ్‌కుమార్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు వసూలు చేయండి

మద్దిపాడు: ఇంటి పన్నులు త్వరితగతిన వసూలు చేయాలని జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి జీవీ నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దొడ్డవరప్పాడు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సర్పంచ్ బెజవాడ రాము, గ్రామ కార్యదర్శి వినోద్ సచివాలయ పాల్గొన్నారు.

ఉమెన్ ఐకాన్ స్వచ్ఛత అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

చీమకుర్తి: ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డు కోసం అర్హత కలిగిన మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ లోపు తమ దరఖాస్తులను చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో అందించాలన్నారు. ఎంపికైన వారికి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్‌నెల 5వ తేదీన అవార్డును ప్రదానం చేస్తారన్నారు. పూర్తి వివరాల కొరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫోన్‌నెంబర్..70329 57962 ద్వారా సమాచారం తెలియజేయాలన్నారు.

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగర పాలక సంస్థలో పన్నులు వసూలు చేయటంలో నిర్లక్ష్యం వహించవద్దని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం గోపాల్ నగర్, నీలాయ పాలెం సచివాలయాలను సందర్శించారు. పన్నుల వసూలులో నిర్లక్ష్యంగా వ్యవహరించి 50 శాతంలోపు పన్నులు వసూలు చేసిన 19 మంది అడ్మిన్ సెక్రటరీలకు చార్జ్ మెమోలు జారీ చేశారు. 6వ డివిజన్ కార్పొరేటర్ చల్లా తిరుమల రావు, ఎంఈ కె. మాల్యాద్రి, ఆర్ఓ తుపాకుల మధుసూదనరావు పాల్గొన్నారు.

అలరించిన అప్పర్ణ అవధానం

ఒంగోలు టౌన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో రెండు రోజులుగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న శతావధానం నగర ప్రజలను ఆకట్టుకున్నాయి. మంగళవారం వర్షన అనే అంశంపై 25 మంది పృచ్ఛకులు అనేక సమస్యలను ప్రస్తావించగా అందుకు తగిన విధంగా అబ్బురపరిచే భావాలతో డాక్టర్ బులుసు అపర్ణ చెప్పిన పద్యాలు సభను రంజింపచేశాయి. పొన్నూరు శ్రీనివాసులు. డా.కడిమెళ్ల వరప్రసాద్, డా.నూనె అంకమరావు, నైనాల రామకృష్ణ, భువనగిరి పురుషోత్తం పాల్గొన్నారు.

ఖాళీల ప్రతిపాదనలు పంపాలి

ఒంగోలు: ఫీల్డు అసిస్టెంట్ల ఖాళీలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఎంపీడీఓలను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పనులకు వచ్చే కూలీల హాజరు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన తాళ్లూరు, దోర్నాల ఎంపీడీఓలకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని జిల్లా పరిషత్ సీఈఓను ఆదేశించారు. వేసవిలో తాగునీటికి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న పాల వెల్లువ పథకం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. మహిళా పోలీసు, ఐసీడీఎస్ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. సీపీఓ వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ శీనారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మారెడ్డి, సచివాలయాల సమన్వయ అధికారి ఉషారాణి, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా జైలులో డైనింగ్ హాలు ప్రారంభం

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలోని జిల్లా కారాగారావాసంలో డైనింగ్ హాలును కారాగార శాఖాధికారి యండీ అహ్‌సన్ రెజా మంగళవారం ప్రారంభించారు. ఒకేసారి 150 మంది కూర్చొని భోజనం చేసేందుకు వీలుగా గ్రానైట్ వ్యాపారి శృంగవరపు రవి, జైలు సిబ్బంది విరాళాలతో పర్మినెంట్ డైనింగ్ హాలును నిర్మించారు. మంగళవారం జిల్లా జైలును సందర్శించిన డీజీ.. వరుణారెడ్డిని అభినందించారు. జిల్లా ఉప కారాగార అధికారి కె.వెంకటరెడ్డి, కారాగార వైద్యాధికారి డా.ఎస్వీఎస్ బ్రహ్మతేజ, జైలర్ జి.ఎరికినాయుడు, చీఫ్ వార్డర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం



మద్దిపాడు: అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలుపుతున్న నాయకులు

మద్దిపాడు: అసెంబ్లీలో సోమవారం సంతనూతలపాడు శాసన సభ్యుడు టీజేఆర్ సుధాకర్‌బాబుపై టీడీపీ ఎమ్మెల్యేలు చేసిన దాడిని మద్దిపాడు మండల నాయకులు ముక్తకంఠంతో ఖండించారు. మంగళవారం మండల కేంద్రం మద్దిపాడు లో పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ టీడీపీ నాయకులకు చట్టసభలలో వ్యవహరించే తీరు, హుందాతనం నేర్చుకునే విధంగా బుద్ధిని ప్రసాదించాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. మండవ అప్పారావు, మోరబోయిన సంజీవ రావు గుడ్డపాతల రవి జడ్పీటీసీ తేళ్ల భాగ్యలక్ష్మి పుల్లారావు నర్రా సురేష్, పైడిపాటి వెంకట్రావు, అవినాష్ రామాంజనేయులు, సన్నపురెడ్డి రమణమ్మ, జయమ్మ మస్తానమ్మ పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ జయప్రదం చేయండి

చీమకుర్తి: ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు ఎస్. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం సంతనూతలపాడు మండలం ఆర్.లక్ష్మీపురంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులను సగానికి సగం తగ్గించి పథకాన్ని నీరుగారుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దాని ప్రభావం ఉపాధి కూలీలపై పడుతుండటం వలన వారికి చాలీచాలని వేతనాలు వస్తున్నాయని, పనిదినాలు తగ్గిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతుగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన యశ్వంత్

ఒంగోలు: జాతీయస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలకు టంగుటూరుకు చెందిన టంగుటూరి యశ్వంత్ ఎంపికైనట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ముఖ్య కార్యదర్శి జి.నవీన్ తెలిపారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు మహారాష్ట్ర పూణే పట్టణంలోని ఛత్రపతి శివాజీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరగనున్న 33వ జాతీయస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొననున్నాడు. యశ్వంత్‌ను ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు,, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ వ్యవస్థాపకులు వి.నాగేశ్వరరావు, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ రాజరాజేశ్వరి తదితరులు అభినందించారు.

గుంటూరులోనే క్యాంటీన్ కార్డుల రెన్యువల్స్

ఒంగోలు టౌన్: విశ్రాంత సైనికులు ఇక నుంచి క్యాంటీన్ కార్డులను హైదరాబాద్‌కు వెళ్లి రెన్యువల్ చేసుకోవాల్సిన అవసరం లేకుండా గుంటూరులో తగిన ఏర్పాటు చేసినట్లు జీటీసీ బ్రిగేడియర్ కె.సోమ శంకర్ తెలిపారు. మంగళవారం ఒంగోలు వచ్చిన ఆయన విశ్రాంత సైనికుల అవగాహన సదస్సులో ప్రసంగించారు. ఇంటిగ్రేటెడ్ సైనిక్ భవన నిర్మాణానికిగాను రిమ్స్ హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను కలిసి చర్చించినట్లు తెలిపారు. అనంతరం క్యాంటీన్‌ను పరిశీలించారు. నెప్పల్లి నాగేశ్వరరావు, చందూరి శ్రీరామ మూర్తి, కోశాధికారి మండవ వెంకటేశ్వర్లు, పాశం వెంకటరెడ్డి పాల్గొన్నారు.